ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -130 పేజీలు - 04 వెల - 04/- ఆదివారం 14 జూన్ 2026

## ఒప్పందానికి చేరువగా

### ఇరాన్, అమెరికా సంకేతాలు

ఆందోళనలో ఇజ్రాయిల్

లెబనాన్‌పై కొనసాగుతున్న ఇజ్రాయిల్ బాంబు దాడులు

వచ్చే నెలలో ఖమేనిఅంత్యక్రియలు



# పెట్టుబడులపై ఫోకస్..!

## నేడు సింగపూర్‌కు సీఎం చంద్రబాబు


సింగపూర్ పర్యటనలో కీలక భేటీలు

సింగపూర్ ప్రధాని, మంత్రులు, పారిశ్రామికవేత్తలతో సమావేశం

అమరావతి నిర్మాణంపై సుర్బానా జురాంగ్ సంస్థతో చర్చలు

2026 సీఐఐ భాగస్వామ్య సదస్సు రోడ్‌షోలో పాల్గొననున్న ముఖ్యమంత్రి

**అమరావతి జూన్ 13, ఆంధ్ర ప్రగతి :**ఏపీకి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు సింగపూర్‌లో పర్యటించనున్నారు. జూన్ 14 నుంచి సాగే ఈ పర్యటనలో రాష్ట్రానికి, ముఖ్యంగా రాజధాని అమరావతి నిర్మాణానికి నిధులు సమీకరించడంపై ఆయన ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఇందుకోసం నేడు ఉదయం బెంగళూరు నుంచి **మిగతా 2లో...**





## కొత్త ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్

జూన్ 30న బాధ్యతల స్వీకరణ

ఉపేంద్ర ద్వివేది అదే రోజు రిటైర్

1986లో సైన్యంలో చేరిన సేథ్

పలు కీలక కమాండ్లకు నాయకత్వం

సైన్యం ఆధునికీకరణలో కీలక పాత్ర

**ఢిల్లీజూన్ 13, ఆంధ్ర ప్రగతి**

భారత సైన్యానికి కొత్త ఆర్మీ చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఆయన వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జూన్ 30న కొత్త ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. **మిగతా 2లో...**

## భారత్ అరుదైన ఘనత..

### ఖండాంతర క్షిపణులనూ అడ్డుకునే సామర్థ్యం!

ఐసీబీఎం ముప్పును అడ్డుకునే సామర్థ్యం భారత్ సొంతం

వరుసగా మూడు దీవీణ ఫ్లైట్ టెస్టులు సక్సెస్

ఈ సామర్థ్యం ఉన్న అతికొన్ని దేశాల జాబితాలో భారత్


నేవల్ యాంటీ-షిప్ మిసైల్ తొలి పరీక్ష విజయవంతం

**ఢిల్లీజూన్ 13, ఆంధ్ర ప్రగతి** రక్షణ రంగంలో భారత్ మరో కీలక మైలురాయిని చేరుకుంది. దీర్ఘశ్రేణి బాలిస్టిక్ క్షిపణులను గాల్లోనే అడ్డుకుని ధ్వంసం చేసే సామర్థ్యాన్ని డీఆర్‌డీఓ విజయవంతంగా పరీక్షించింది. సముద్రంలో శత్రు నౌకలను లక్ష్యంగా చేసుకొనే కొత్త క్షిపణి సామర్థ్యాన్నీ ప్రదర్శించింది. **మిగతా 2లో...**




## జైల్లో నిందితుడు.. ఫైల్లో టైఫాయిడ్..!

.. నంద్యాల డిఆర్డిఏ వెలుగులో చీకటి బాగోతం.




5లో



## అన్ని ప్రాంతాలకూ అభివృద్ధి..

### హెల్త్‌కేర్‌లో ప్రెడిక్టివ్ విధానం: మంత్రి సత్యకుమార్

అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న సత్యకుమార్

ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని వ్యాఖ్య

ప్రజల వద్దకే వెళ్లి 45 రకాల వైద్య సేవలు అందిస్తున్నామని వెల్లడి

**అమరావతి జూన్ 13, ఆంధ్ర ప్రగతి** ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి, అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. తిరుపతి సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సైతం ఇదే విషయాన్ని ప్రజలకు స్పష్టంగా వివరించారని గుర్తుచేశారు. **మిగతా 2లో...**

## చెరువుల పునరుద్ధరణకు ప్రాధాన్యత

ఉపాధి హామీ నిధులను పూర్తి వినియోగం

సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి జూన్ 13, ఆంధ్ర ప్రగతి**

జలధార-జలహారతి పనుల్లో గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణ, అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతివ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. జలధార పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. **మిగతా 2లో...**



## నా మీద కోపం నేతన్నల మీద చూపొద్దు

కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్.. కార్యకర్తలకు దిశానిర్దేశం

సిరిసిల్లలో పార్టీ శ్రేణులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశం

తనపై కోపంతో స్థానిక నేతలను వేధించొద్దని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి

ధాన్యం కొనుగోళ్లలో గన్నీ బ్యాగుల కొరతపై విమర్శలు



2లో

# హైఅలర్ట్‌గా ఉండండి

## సమస్యాత్మక ప్రాంతాలకు టీమ్‌లను ముందుగా పంపండి

భారీ వర్షాల నేపథ్యంలో అధికారులకు సీఎం ఆదేశాలు

**హైదరాబాద్ జూన్ 13, ఆంధ్ర ప్రగతి**

భారీ వర్షాల నేపథ్యంలో హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో హై అలర్ట్‌గా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. పోలీస్, ట్రాఫిక్ పోలీస్, మున్సిపల్, హైడ్రా, విద్యుత్, వాటర్ బోర్డ్, ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. చీఫ్ సెక్రటరీ, డీజీపీ, క్యూర్ స్పెషల్ సీఎస్ సహా సీనియర్ అధికారులందరి తో యుద్ధ ప్రాతిపదికన సమీక్షించి చర్యలు చేపట్టాలన్నారు. నగరవాసులకు ఇబ్బందులు తలెత్తకుండా సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. **మిగతా 2లో...**



## రెండేళ్లలోనే కూటమి ప్రభుత్వం విఫలం

నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయన్న బొత్స

రైతులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని విమర్శ

సూపర్ సిక్స్ పథకాలు ఏమయ్యాయని నిలదీత



2లో

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రభ
తెలుగు దినపత్రిక



# కొత్త ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్

**మొదటిపేజీ తరువాయి**

ప్రస్తుత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది అదే రోజు పదవీ విరమణ చేయనున్నారు. దీంతో ధీరజ్ సేథ్ భారత సైన్యానికి తదుపరి అధిపతిగా బాధ్యతలు చేపట్టనున్నారు. సేథ్ నేషనల్ డిఫెన్స్ అకాడమీలో శిక్షణ పొందారు. 1986 డిసెంబర్‌లో ఆర్మర్డ్ కార్ప్స్‌లో అధికారిగా సైన్యంలో చేరారు. దాదాపు 40 ఏళ్లకు పైగా సాగిన సైనిక జీవితంలో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఎడారి ప్రాంతాల్లో ఆర్మర్డ్ రెజిమెంట్‌కు నాయకత్వం వహించిన ధీరజ్ సేథ్, పశ్చిమ సరిహద్దు ప్రాంతంలో ఆర్మ్‌డ్ బ్రిగేడ్‌కు కమాండర్‌గా పనిచేశారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలను పర్యవేక్షించే దళాలకు కూడా నాయకత్వం అందించారు. లెఫ్టినెంట్ జనరల్ హోదాలో భారత సైన్యంలో అత్యంత కీలకమైన స్ట్రైక్ ఫార్మేషన్లలో ఒకటైన సుదర్శన్ చక్ర కార్ప్స్‌కు కమాండర్‌గా వ్యవహరించారు. ఢిల్లీ ప్రాంత జనరల్ ఆఫీసర్ ఇన్ కమాండింగ్‌గా కూడా పనిచేశారు. ఈ సమయంలో దేశీయ, అంతర్జాతీయ సైనిక కార్యక్రమాల సమన్వయం బాధ్యతలు నిర్వర్తించారు. సైన్యాన్ని ఆధునిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడంలో ధీరజ్ సేథ్ కీలక పాత్ర పోషించారు. సైనిక సామర్థ్యాల పెంపు, భవిష్యత్ వ్యూహాల రూపకల్పన, దళాల పునర్వ్యవస్థీకరణ వంటి అంశాల్లో ఆయన సేవలు విశేష గుర్తింపు పొందాయి. ధీరజ్ సేథ్ హయ్యర్ కమాండ్ కోర్స్, నేషనల్ డిఫెన్స్ కాలేజ్‌లో ఉన్నత శిక్షణ పొందారు. ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్‌లో నిర్వహించే ప్రతిష్ఠాత్మక కమాండ్ అండ్ స్టాఫ్ కోర్స్‌లో కూడా పాల్గొన్నారు. సమకాలీన సైనిక వ్యూహాలపై ఆయనకు విస్తృత అవగాహన ఉందని అధికారులు చెబుతున్నారు.

# అన్ని ప్రాంతాలకూ అభివృద్ధి..

**మొదటిపేజీ తరువాయి**

గత రెండేళ్ల కాలంలో వైద్య ఆరోగ్య శాఖలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు, భవిష్యత్ ప్రణాళికలను మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన, ఉచిత వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగి వివరాలను, వారి వైద్య చరిత్రను పూర్తి స్థాయిలో డిజిటలైజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఓపీ సేవల నుంచి స్పెషలిస్ట్ వైద్య సేవల వరకు అనేక సంస్కరణలు అమలు చేశామన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో సాంప్రదాయ వైద్య విధానాల నుంచి 'ప్రెడిక్టివ్ హెల్త్‌కేర్' విధానంలోకి అడుగుపెట్టామని మంత్రి చెప్పారు. అంటే.. వ్యాధి వచ్చాక వైద్యం చేయడం కంటే, అది రాకముందే గుర్తించేలా వ్యవస్థను మార్చామన్నారు. ప్రజల వద్దకే నేరుగా వెళ్లి 45 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నామని, దీనివల్ల వ్యాధులను ముందే గుర్తించి అవసరమైన మందులు పంపిణీ చేస్తున్నామని వివరించారు. అలాగే టెలిమెడిసిన్ ద్వారా రోగుల సందేహాలకు నిపుణులైన వైద్యులతో సమాధానాలు ఇప్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న మెరుగైన సేవల వల్ల ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం, సంతృప్తి పెరిగాయని.. అందుకే ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పెరిగిందని సత్యకుమార్ అన్నారు. తమ ప్రభుత్వ పనితీరుకు ఆసుపత్రుల్లోని గణాంకాలే నిదర్శనమని చెప్పారు. 'స్వర్ణాంధ్ర-2047' లక్ష్య సాధనలో 'ఆరోగ్యాంధ్రప్రదేశ్' అత్యంత కీలక పాత్ర పోషిస్తోందని చెబుతూ.. ఈ మార్పునకు సహకరించిన వైద్య సిబ్బందికి, అధికారులకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

# భారత్ అరుదైన ఘనత..

**మొదటిపేజీ తరువాయి**

వరుసగా నిర్వహించిన మూడు ప్రయోగాత్మక పరీక్షలు విజయవంతం కావడంతో అత్యాధునిక క్షిపణి రక్షణ వ్యవస్థలు కలిగిన దేశాల సరసన భారత్ నిలిచింది.

డీఆర్‌డీఓ నిర్వహించిన మూడు వరుస పరీక్షల్లో ఇంటర్‌సెప్టర్ క్షిపణులు తమ లక్ష్యాలను కచ్చితంగా ఛేదించాయి. బహుళస్థాయి బాలిస్టిక్ మిసైల్ డిఫెన్స్ వ్యవస్థ సామర్థ్యాన్ని ఈ పరీక్షలు నిరూపించాయి. ఆధునిక క్షిపణి ముప్పులను ఎదుర్కొనేలా రూపొందించిన ఈ వ్యవస్థ శత్రు బాలిస్టిక్ క్షిపణులను లక్ష్యానికి చేరకముందే నిర్వీర్యం చేయగలదని అధికారులు తెలిపారు.

ఈ విజయాలతో భారత్ ప్రపంచంలోని కొన్ని దేశాలకే ఉన్న ప్రత్యేక సామర్థ్యాన్ని సొంతం చేసుకుంది. ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు (ఐసీబీఎంలు) సహా అత్యంత ప్రమాదకరమైన క్షిపణి ముప్పును అడ్డుకునే రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేసిన దేశాల జాబితాలో భారత్ చేరిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఇది దేశ భద్రతా వ్యవస్థకు కీలక బలాన్ని చేకూర్చనుంది.

మరోవైపు నేవల్ యాంటీ-షిప్ మిసైల్ (మీడియం రేంజ్) తొలి ఫ్లైట్ టెస్ట్‌ను కూడా డీఆర్‌డీఓ విజయవంతంగా పూర్తి చేసింది. మధ్యశ్రేణి దూరంలో శత్రు యుద్ధ నౌకలను కచ్చితంగా లక్ష్యంగా చేసుకునే ఈ క్షిపణి భారత నౌకాదళ దాడి సామర్థ్యాన్ని మరింత పెంచనుంది. ఈ విజయాలపై డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలను రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు.

# హైఅలర్ట్‌గా ఉండండి

**మొదటిపేజీ తరువాయి**

రెయిన్ ఫోర్ కాస్టింగ్ ఆధారంగా రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో టీములను ముందస్తుగా మోహరించాలని సీఎం సూచించారు. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. శంషాబాద్ వద్ద బెంగళూరు హైవేపై భారీగా వర్షపు నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత సిబ్బంది.. మోటార్ల ద్వారా నీటిని తొలగిస్తున్నారు. షాద్‌నగర్‌లోనూ జాతీయ రహదారిపై భారీగా వరద నిలిచింది.

# నా మీద కోపం నేతన్నల మీద చూపొద్దు

**హైదరాబాద్, జూన్ 13 ఆంధ్ర ప్రగతి**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం సిరిసిల్లలో నిర్వహించిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన, పార్టీ శ్రేణులన్నీ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తనతో ఉన్న వ్యక్తిగత విభేదాల కారణంగా సిరిసిల్లలోని బీఆర్ఎస్ నాయకులను లక్ష్యంగా చేసుకోవద్దని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. బతుకమ్మ చీరల ఆర్డర్లను రద్దు చేయడం ద్వారా స్థానిక చిన్న తరహా పరిశ్రమలను ప్రభుత్వం దెబ్బతీసిందని ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కనీసం గన్నీ బ్యాగులు కూడా అందుబాటులో లేవని, ఉన్నవాటిని ఇతర అవసరాలకు మళ్లించారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 900 రోజులైనా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో 119 నియోజకవర్గాల్లోనూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను పార్టీ ముఖచిత్రంగా ప్రాజెక్ట్ చేయాలని, ఆయన్ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# రెండేళ్లలోనే కూటమి ప్రభుత్వం విఫలం

## నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయన్న బొత్స

**జూన్ 13, ఆంధ్ర ప్రగతి** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తికాకముందే అన్ని రంగాల్లో విఫలమైందని వైసీపీ శాసనమండలి పక్ష నేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. ఈరోజు విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడిన ఆయన, ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరగడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బొత్స పేర్కొన్నారు. రైతులకు తమ పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని, జొన్న, మామిడి పంటలకు కూడా కనీస మద్దతు ధర అందడం లేదని అన్నారు. ఆక్వా రంగం పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయిందని ఆరోపించారు. విద్యాశాఖను మంత్రి నారా లోకేశ్‌కు అభివృద్ధి కోసం అప్పగించారా లేక దాన్ని నిర్వీర్యం చేయడానికా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్ సిక్స్, సూపర్ సెవన్ హామీలు ఏమయ్యాయని నిలదీశారు. ఆడబిడ్డ నిధి పథకాన్ని ప్రభుత్వం దాదాపు పక్కన పెట్టిందని విమర్శించారు. ఇటీవల తిరుపతిలో నిర్వహించిన సభను విజయోత్సవ సభగా కాకుండా 'వెన్నుపోటు ఉత్సవం'గా అభివర్ణించిన బొత్స, టీడీపీని 'వెన్నుపోటు పార్టీ'గా పేర్కొన్నారు. రైతులు యూరియా కోసం ఒడిశా నుంచి ఒక్కో బస్తా రూ.600 చొప్పున కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆరోపించారు.

# చెరువుల పునరుద్ధరణకు ప్రాధాన్యత

**మొదటిపేజీ తరువాయి**

ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జలధార-జలహారతి పనుల పురోగతిపై ముఖ్యమంత్రి శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ నిధులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా జలధార పనులు చేపట్టాలన్నారు. ఈ నిధుల వినియోగంలో అలసత్వాన్ని ప్రదర్శించవద్దన్నారు. నీటి మిగులు బేసిన్ల నుంచి తక్కువ నీటి లభ్యత ఉన్న బేసిన్లను అనుసంధానం చేసే పనులను చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. జలధార పనుల కింద చెక్ డ్యామ్‌లు, ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్‌లు, కాంటూర్ కందకాల పునరుద్ధరణ పనుల్లో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. చిన్న వాగుల అభివృద్ధికి.. వాల్మీకిపురం వాగు అభివృద్ధి మోడల్ పరిశీలించాలని సూచించారు. నీటి భద్రత విషయంలో ప్రతీ జిల్లా ఒక వినూత్నమైన విధానాన్ని అమలు చేయాలని చెప్పారు. జలధార మొదటి విడత పనులు పూర్తయిన తర్వాత చెక్ డ్యామ్‌లు, ఫామ్ పాండ్‌లు, చెరువులకు గండ్లు పడకూడదన్నారు. నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా కాలువలు, కరకట్టలలో అడ్డంకులు తొలగించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు అధికారులు క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. జలధార వల్ల కలిగే లాభాలను ఇరిగేషన్, అవేర్ వంటి సంస్థలు ఎప్పటికప్పుడు అంచనా వేయాలన్నారు. జిల్లాల వారీగా భూగర్భ జలాల పునరుద్ధరణ లెక్కలను సిద్ధం చేయాలని చెప్పారు. జలధార కార్యక్రమంలో స్థానికులు, రైతులు, నీటి సంఘాలను భాగస్వాములు చేయాలని, దీనికి ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమీక్షలో మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఒప్పందానికి చేరువగా

**ఇరాన్, అమెరికా సంకేతాలు**

**ఆందోళనలో ఇజ్రాయిల్**

**లెబనాన్‌పై కొనసాగుతున్న ఇజ్రాయిల్ బాంబు దాడులు**

**వచ్చే నెలలో ఖమేనిఅంత్యక్రియలు**



**ఢిల్లీజూన్ 13, ఆంధ్ర ప్రగతి**

శాంతి ఒప్పందానికి చేరువగా ఉన్నామని ఇరాన్, అమెరికా దేశాలు సంకేతాలు ఇచ్చాయి. అయితే కీలక అంశాలపై ఇంకా అవగాహన కుదరలేదని సమాచారం. రెండు దేశాల మధ్య మధ్యవర్తిత్వం నెరపుతున్న పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కూడా రాబోయే 24 గంటలలో ఒప్పందం ఖరారవుతుందని చెప్పారు. ఓ వైపు ఇరాన్-అమెరికా మధ్య చర్చలు కొనసాగుతుండగానే మరోవైపు దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయిల్ సేనలు బాంబు దాడులు కొనసాగించాయి. తాజా దాడులలో కనీసం ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇదిలావుండగా తన వద్ద ఉన్న యురేనియం నిల్వలను భద్రపరచుకోవడానికి ఇరాన్ ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఇరాన్ వద్ద ఉన్న యురేనియం ముడి పదార్థాలను స్వాధీనం చేసుకునేందుకు అమెరికా ప్రయత్నించవచ్చునని అనుమానాలు వ్యక్తమవుతున్న తరుణంలో టెహ్రాన్ పలు చర్యలు చేపట్టింది. సొరంగాలను మూసేసింది. కీలకమైన అణు స్థావరాల చుట్టూ మందుపాతరలు అమర్చింది. ఇరాన్ యురేనియం నిల్వలలో అధిక భాగం ఇస్ఫహాన్ అణు సముదాయంలోని భూగర్భంలో ఉన్నదని, ఇతర చోట్ల కూడా స్వల్ప పరిమాణంలో నిల్వ ఉన్నదని తెలుస్తోంది.

**ఎవరేమన్నారు?**

మధ్యప్రాచ్యంలో యుద్ధాన్ని ముగించేందుకు అమెరికాతో కుదుర్చుకుంటున్న అవగాహనా ఒప్పందం (ఎంఓయూ) ఇంతకుముందు ఎన్నడూ లేనంత చేరువగా ఉన్నదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తెలిపారు. అది ఖరారయ్యే వరకూ ఊహాగానాలు చేయవద్దని మీడియాను కోరారు. అరాగ్చీ ప్రకటనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో తిరిగి పోస్ట్ చేశారు. ఇరు పక్షాల అంగీకారంతో శాంతి ఒప్పందం ఖరారైందని, అయితే తదుపరి చర్యలు పెండింగులో ఉన్నాయని పాక్ ప్రధాని షరీఫ్ చెప్పారు. ఒప్పందంపై ఎలక్ట్రానిక్ సంతకాలు జరుగుతాయని, వచ్చే వారం సాంకేతిక స్థాయి చర్చలు ప్రారంభమవుతాయని తెలిపారు. చర్చల సందర్భంగా ఇరాన్, అమెరికాలు చూపిన నిబద్ధతను ప్రశంసించారు. చర్చలకు మద్దతు తెలిపిన మధ్యప్రాచ్య దేశాలకు కృతజ్ఞతలు తెలియ జేశారు. 'ఈ చారిత్రక ఒప్పందం చిరకాల శాంతికి బలమైన పునాది వేస్తుందని మాకు నమ్మకం ఉంది' అని అన్నారు. కాగా అమెరికా-ఇరాన్ చర్చలలో పురోగతిపై పాకిస్తాన్, ఈజిప్ట్ హర్షం వ్యక్తం చేశాయి. శాంతి ఒప్పందంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు సమసిపోతాయని తెలిపాయి.

**ఒప్పందంపై ఇజ్రాయిల్ ఆందోళన**

అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదరడం ఇజ్రాయిల్‌కు ఏ మాత్రం ఇష్టం లేదు. ఎందుకంటే దేశ ప్రజల ముందు ఇజ్రాయిల్ ఉంచిన వ్యూహాత్మక లక్ష్యాలు వేరేగా ఉన్నాయి. యుద్ధాన్ని ముగించే ఉద్దేశం ఇజ్రాయిల్‌కు లేదు. ఇరాన్-అమెరికా మధ్య కుదిరే ఒప్పందం కంటే లెబనాన్‌పై పట్టు సాధించడానికే ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ప్రాధాన్యత ఇస్తున్నారు.

**వచ్చే నెలలో ఖమేనీ అంత్యక్రియలు**

అమెరికా-ఇజ్రాయిల్ దాడులలో ప్రాణాలు కోల్పోయిన ఇరాన్ మాజీ సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు జూలైలో మొదలవు తాయని ప్రభుత్వ మీడియా తెలిపింది. జూలై 4, 5 తేదీలలో టెహ్రాన్‌లో వీడ్కోలు కార్యక్రమం జరుగుతుందని, ఆ మరునాడు టెహ్రాన్‌లో, జూలై 7న ఖోమ్‌లో అంత్యక్రియలు జరుగుతాయని వివరించింది. జూలై 9న మష్హద్ నగరంలోని ఇమామ్ రెజా మసీదులో మరో అంత్యక్రియల కార్యక్రమాన్ని నిర్వహించిన తర్వాత ఖమేనీ భౌతికకాయాన్ని ఖననం చేస్తారు.

# పెట్టుబడులపై ఫోకస్..!

**మొదటిపేజీ తరువాయి**

ఆయన సింగపూర్‌కు బయలుదేరి వెళ్లనున్నారు. ముఖ్యమంత్రి వెంట పురపాలక శాఖ మంత్రి నారాయణ, పలువురు ఉన్నతాధికారులు కూడా ఈ పర్యటనకు వెళ్లనున్నారు.

పర్యటనలో భాగంగా చంద్రబాబు సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో పాటు ఆ దేశ ఉప ప్రధాని, వాణిజ్య మంత్రి గాన్ కిమ్ యాంగ్, విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్, హోం మంత్రి షణ్ముగమ్ వంటి కీలక నేతలతో సమావేశమవుతారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను, ప్రభుత్వ విధానాలను వారికి వివరించనున్నారు. తొలుత సింగపూర్‌లోని భారత హై కమిషనర్ శిల్పక్ అంబులేతో భేటీ అయి పర్యటన అజెండాపై చర్చిస్తారు. పారిశ్రామిక, వాణిజ్య రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు గూగుల్ క్లౌడ్, జీఐసీ, వైసీహెచ్ లాజిస్టిక్స్ వంటి దిగ్గజ సంస్థల ప్రతినిధులతో చంద్రబాబు భేటీ కానున్నారు. స్టార్టప్ వెంచర్ క్యాపిటలిస్టులతో జరిగే రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొంటారు. నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ అధ్యక్షుడితోనూ సమావేశమై విద్యా రంగంలో భాగస్వామ్యంపై చర్చిస్తారు. ఈ పర్యటనలో అత్యంత కీలకమైన అంశం రాజధాని అమరావతి. రాజధాని మాస్టర్ ప్లాన్ రూపొందించిన సుర్బానా జురాంగ్ సంస్థ ప్రతినిధులతో అమరావతి ప్రణాళికపై ప్రత్యేకంగా సమావేశం కానున్నారు.

పర్యటనలో భాగంగా 'వరల్డ్ సిటీస్ సమ్మిట్'లో పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం 2026లో విశాఖలో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు సన్నాహకంగా ఏర్పాటు చేసిన బిజినెస్ రోడ్‌షోలో చంద్రబాబు పాల్గొంటారు. పర్యటన ముగించుకుని 16న రాత్రి 10 గంటలకు ఆయన తిరిగి స్వదేశానికి రానున్నారు. ముఖ్యమంత్రి వెంట పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్, సీఆర్డీఏ అధికారుల బృందం కూడా ఈ పర్యటనలో పాల్గొంటుంది.

# యువత జాబ్ మేళా ను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలి.

**..యువతకు 5 సం"లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం.**

**..జాబ్ మేళా లో పరిశ్రమలు,వాణిజ్యం మరియు ఫుడ్ ప్రోసెసింగ్ శాఖ మంత్రి టి జి భరత్ గుప్త.**




**ఆంధ్ర ప్రగతి కర్నూలు టౌన్,జూన్ 13:**

ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న జాబ్ మేళాలను యువత సద్వినియోగం చేసుకోవాలని తద్వారా అనుభవం సాధించి భవిష్యత్తు లో మంచి అభివృద్ధి సాధించాలని కర్నూలు క్లస్టర్ యూనివర్సిటీ జాబ్ మేళా సమావేశంలో యువతను ఉద్దేశించిపరిశ్రమలు,వాణిజ్యం మరియు ఫుడ్ ప్రోసెసింగ్ శాఖ మంత్రి టి జి భరత్ గుప్త పేర్కొన్నారు.

శనివారం ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నైపుణ్యాల అభివృద్ధి విభాగం మరియు శిక్షణ సంస్థ కర్నూలు క్లస్టర్ యూనివర్సిటీ సమావేశ మందిరం లో ఏర్పాటు చేసిన 4 వ మెగా జాబ్ మేళా ను పరిశ్రమలు , వాణిజ్యం మరియు ఫుడ్ ప్రోసెసింగ్ శాఖ మంత్రి టి జి భరత్ గుప్త ప్రారంభించి యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...కర్నూలులో ఇప్పటివరకు మూడు మెగా జాబ్ మేళాలు నిర్వహించామని అందులో కేవలం 50 శాతం ఉద్యోగాలు మాత్రమే యువత సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. దీనికి కారణం యువతలో నైపుణ్యం లేకపోవడం లేదా ఉద్యోగం వచ్చిన చేరకుండా ఉండొచ్చని అన్నారు. ఈరోజు 19 కంపెనీలు దాదాపు 1500 ఉద్యోగాలు యువతకు ఇచ్చే ఉద్దేశంతో ఇక్కడకు వచ్చాయని ఇందులో మీ ప్రతిభను చూపెట్టి ఉద్యోగాలు సాధించాలని , వచ్చిన ఉద్యోగంలో వెంటనే చేరిపోయి కొన్ని సంవత్సరాలు పాటు పని చేసి అనుభవం గడించాలని ఆ తరువాత మీకు ఏ విధంగా అభివృద్ధి చెందాలో పూర్తి అవగాహన వస్తుందని కావున ఇప్పుడు ఉన్న అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని యువతను కోరారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో 5 సంవత్సరాలలో 20 లక్షల ఉద్యోగాలు యువతకు అందించాలన్న దృఢ సంకల్పంతో పని చేస్తూ ఉన్నదని తెలిపారు. ప్రస్తుతం యువత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో కూడా పోటీ పడవలసిన అవసరం ఏర్పడిందని తెలిపారు. యువత వారి వారి రంగాలలో నైపుణ్యం సాధించి ఉండడం చాలా అవసరమని మంత్రి పేర్కొన్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్ ఇండస్ట్రియల్ హబ్ లో రిలయన్స్ , అగస్త్యా , గ్రీన్ హైడ్రోజన్ , సోలార్ , విండ్ పవర్ ఉత్పత్తి లాంటి చాలా పెద్ద కంపెనీలు పనులు మొదలుపెట్టాయని జయరాజ్ ఇస్పాత్ విస్తరణ జరుగుతూ ఉందని మరియు రాష్ట్రంలో అన్ని జిల్లాలలో ఎం ఎస్ ఎం ఈ లు ఏర్పాటు చేస్తున్నామని వాటి ద్వారా ఉద్యోగాలు వస్తాయని అందుకు యువత ఆ కంపెనీలలో పనిచేయడానికి అవసరమైన అనుభవంతో సిద్ధంగా ఉండాలని కోరారు. ప్రస్తుతం దేశంలో ఏర్పాటు అవుతున్న క్రొత్త పరిశ్రమలలో 25 శాతం మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషితో ఆంధ్రప్రదేశ్ లోనే ఏర్పాటు అవుతున్నాయని , త్వరలో 50 శాతం చేరుకునే దానికి కూడా అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ విధంగా ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా నిలిచే అవకాశం ఉందని తెలిపారు. అధికారుల కోరిక మేరకు యూనివర్సిటీ ప్రాంగణంలో మినరల్ వాటర్ ప్లాంట్ మరియు కాంపౌండ్ వాల్ నిర్మాణానికి విడతలవారీగా సహకరిస్తామని మంత్రి తెలియజేశారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి క్లస్టర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వెంకట బసవరావు మాట్లాడుతూ... గత ప్రభుత్వం లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ద్వారా ఏర్పాటు కాబడిన ఈ యూనివర్సిటీ ద్వారా మంచి విద్యను అందిస్తున్నామని మరియు పరిశోధనలకు సహకరిస్తున్నామని తెలిపారు. ఈ ప్రాంగణంలో 19 సంస్థల తో 4వ జాబ్ మేళాను దూర దృష్టిగల మంత్రి భరత్ గారు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోని అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

ఈ సమావేశాన్ని ఉద్దేశించి సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపల్ నాగరాజు శెట్టి , డిస్టిక్ స్కిల్ డెవలప్మెంట్ అధికారి ఆనందరాజ కుమార్, రిజిస్ట్రార్ శ్రీనివాసులు యువత అభివృద్ధి చెందడానికి పలు సూచనలు తెలియజేశారు. అడ్మినిస్ట్రేటర్ అక్తర్ భాను, సమావేశము లో పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# నంద్యాలలో ఆపరేషన్ వజ్రప్రహార్.!

## డ్రోన్ కెమెరాలతో పోలీసుల విస్తృత తనిఖీలు.

-గంజాయి, నిషేధిత మాదకద్రవ్యాల నియంత్రణే లక్ష్యం.

-జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసులు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ జూన్ 13:**నంద్యాల జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక నిఘా పెట్టింది. జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు, నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పి కుమారి ఎం. జావళి ఐపీఎస్ సూచనలతో నేటి తెల్లవారుజామున నంద్యాల పట్టణంలో 'ఆపరేషన్ వజ్రప్రహార్' కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్ మరియు వారి సిబ్బంది ఆధ్వర్యంలో ఈ విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా పట్టణంలోని రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు, గూడ్స్ షెడ్, బొగ్గు లైన్ మొదలైన సమస్యాత్మక ప్రాంతాలను పోలీసులు పూర్తిగా జల్లెడ పట్టారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, మాదకద్రవ్యాల రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పోలీసులు అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించారు. నిందితులు లేదా అనుమానితులు తప్పించుకోకుండా ఉండేందుకు డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా ఏర్పాటు చేసి ఆపరేషన్‌ను పర్యవేక్షించారు. రైల్వే స్టేషన్ పరిసరాల్లో తిరుగుతున్న ప్రతి ఒక్కరిని, వారి లగేజీలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. నంద్యాల జిల్లాలో గంజాయి మరియు ఇతర నిషేధిత మాదకద్రవ్యాల విక్రయాలు, రవాణా, వాడకంపై ఉక్కుపాదం మోపుతామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు. యువత భవిష్యత్తును నాశనం చేసే ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా సరే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# పేదల వారి కడుపు నింపి సంబరపడ్డ హెడ్ కానిస్టేబుల్ రమేష్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ జూన్ 13:**
నంద్యాల పట్టణంలో ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఆర్.రమేష్. తన ఔదార్యాన్ని చాటుకున్నారు. తనకు కలిగిన సంతోషాన్ని పదిమంది పేదలకు అన్నదానం చేయాలని ఓ మంచి నిర్ణయంతో ఈరోజు నంద్యాల రైల్వే స్టేషన్ వద్ద నిరాశ్రయులకు కడుపు నిండా శ్రేష్టమైన భోజనంతో కడుపు నింపారు. తన కుటుంబంలో వచ్చే ప్రతి సంతోషాన్ని పేదల మధ్య చేసుకోవడం ఆనవాయితీ అలాగే నేడు తన కుటుంబంలో కలిగిన సంతోషానికి సుమారు130 మంది నిరాశ్రయులకు కడుపునిండా భోజనం పెట్టారు. ఆర్ రమేష్ మాటల్లో తన కుటుంబ సభ్యులతో కలిసి రైల్వే స్టేషన్ వద్ద ఉన్న నిరాశ్రయులకు కడుపునిండా భోజనం పెట్టడంలో కలిగే ఆనందం మాటల్లో చెప్పలేనిదని, తన కుమారునికి వచ్చిన ఇంటెన్షిప్ ఆనందాన్ని పలువురు పేదలతో పంచుకొని ఆనందించడంలో కలిగే సంతోషం మాటల్లో చెప్పలేదని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ తమ తమ కుటుంబాల్లో జరిగే సంతోషాన్ని ఇలా అనాథల మధ్య వారి కడుపునిండా భోజనం పెట్టి ఆదుకోవడం మన బాధ్యత అని నంద్యాల ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ ఆర్.రమేష్ అన్నారు ఈ అన్నదాన కార్యక్రమంలో తన కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

# కర్నూలు పట్టణ స్వచ్ఛత వైపు సమిష్టి అడుగులు.

-జిల్లా కలెక్టర్, నగరపాలక ప్రత్యేక అధికారిణి డాక్టర్ ఏ.సిరి.

-ఆపరేషన్ క్లీన్ స్వీప్‌తో ప్రతి వార్డులో పరిశుభ్రత ముద్ర.





**ఆంధ్ర ప్రగతి కర్నూలు టౌన్ జూన్ 13:**నగరాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు నగరపాలక సంస్థ చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలకు ప్రజల సహకారం అవసరమని జిల్లా కలెక్టర్, నగరపాలక ప్రత్యేక అధికారిణి డాక్టర్ ఏ.సిరి అన్నారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' నాలుగో వారపు కార్యక్రమాలను శనివారం నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఓల్డ్ కల్లూరు కురువ వీధిలో ప్రజా మరుగుదొడ్ల శుభ్రత, ముజఫర్ నగర్‌లో గార్బేజ్ పాయింట్‌ను నర్సరీగా అభివృద్ధి చేసిన ప్రాంతంలో ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వచ్ఛత అనేది కేవలం పారిశుద్ధ్య సిబ్బంది బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. తడి, పొడి, శానిటరీ, హానికర వ్యర్థాలను వేర్వేరుగా అందించడం, చెత్తను రహదారులపై వేయకుండా పారిశుద్ధ్య సిబ్బందికి అప్పగించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా స్వచ్ఛ నగర నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమిష్టి కృషితోనే ఆరోగ్యకరమైన, అభివృద్ధి చెందిన నగరాన్ని నిర్మించగలమన్నారు.
గత నాలుగు వారాలుగా వివిధ అంశాలపై ప్రత్యేక స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించి ప్రతి వార్డులో ఆపరేషన్ క్లీన్ స్వీప్ ముద్ర వేయడం జరిగిందన్నారు. నగర పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన, చైతన్యం పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ.. గత నాలుగు వారాలుగా ప్రతి శనివారం ప్రత్యేక థీమ్‌తో ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. రహదారులు, జంక్షన్లు, రెడ్–యెల్లో స్పాట్ల శుభ్రత, కాలువలు, డ్రైన్లు, వీధుల పరిశుభ్రత, వ్యర్థాల వర్గీకరణపై అవగాహన, మార్కెట్లు, వాణిజ్య ప్రాంతాల పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రస్తుతం ప్రజా మరుగుదొడ్ల పరిశుభ్రత, చెత్త పేరుకుపోయిన ప్రాంతాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. నగర శుభ్రత కోసం ప్రభుత్వం, నగరపాలక సంస్థ, పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న కృషిని ప్రజలు గుర్తించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం.రఘు, డీఈఈలు పవన్ కుమార్ రెడ్డి, శ్రీనివాసన్, ఏఈ ప్రవీణ్ కుమార్ రెడ్డి, శానిటేషన్ ఇన్స్పెక్టర్లు రమేష్, కుర్మయ్య, ఎంజల్ ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

# యోగా భారతీయ సంస్కృతికి ప్రతీక.

..శారీరక,మానసిక ఆరోగ్యం మెరుగుపరచడం లో యోగా ది కీలకపాత్ర.

..జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్.





**ఆంధ్ర ప్రగతి కర్నూలు టౌన్ జూన్ 13:** యోగా భారతీయ సంస్కృతికి ప్రతీక అని, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "యోగాంధ్ర" కార్యక్రమంలో భాగంగా నగరంలోని ఇండోర్ స్టేడియం వద్ద నిర్వహిస్తున్న పర్యాటక యోగ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ యోగా ద్వారా ఒత్తిడి తగ్గి, ఏకాగ్రత పెరగడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవచ్చని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ శారీరక, మానసిక ఆరోగ్యాభివృద్ధి కోసం యోగాను స్వచ్ఛందంగా అలవాటు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలందరూ యోగాంధ్రలో నమోదు చేసుకుని జూన్ 21న నిర్వహించే మెగా యోగా కార్యక్రమంలో పాల్గొనాలని జాయింట్ కలెక్టర్ కోరారు. రోజుకు కనీసం 10 నిమిషాల పాటు ప్రాణాయామం చేసినా ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని జాయింట్ కలెక్టర్ తెలిపారు.
కార్యక్రమంలో కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, సెట్కూర్ సీఈవో వేణుగోపాల్, టూరిజం అధికారి లక్ష్మీ నారాయణ, జిల్లా లేప్రసీ అధికారి డా.భాస్కర్ రాజు, డిఈఓ సుధాకర్, మెప్మా పిడి శ్రీనివాసులు, డిఎస్డిఓ భూపతి రావు, యోగంధ్ర ఆయుష్ జిల్లా నోడల్ అధికారి డా. అమర్నాథ్, ఆయుష్ మెడికల్ అధికారి చంద్రిక, సీనియర్ వైద్యులు డా. కే. వి.ఎన్ ప్రసాద్, రాష్ట్ర యోగ సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్, జిల్లా యోగ సంఘం ప్రధాన కార్యదర్శి మునిస్వామి, నేషనల్ యోగ జడ్జి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణపై ప్రత్యేక దృష్టి

..నంద్యాలలో ఘనంగా ఎస్ఐఆర్ అవగాహన సదస్సు.

..నంద్యాల టీడీపీ కార్యాలయంలో ఓటరు నమోదు పై అవగాహన.

..క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని పార్టీ శ్రేణులకు మంత్రి ఫరూక్ పిలుపు.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 13:**
నంద్యాల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (ఎస్ఐఆర్) అవగాహన సదస్సు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మరియు తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ , నంద్యాల జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షులు భాస్కర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ద్వారా ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేసుకోవడానికి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని అర్హులైన ప్రతి పౌరుడు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఓటరు నమోదు అనేది ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన అంశమని, పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి వెళ్లి ఓటరు నమోదు, ధృవీకరణ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని సూచించారు.
టీడీపీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు తమ నియోజకవర్గ పరిధిలో అర్హులైన ఓటర్ల వివరాలను సరిచూసుకోవడంలో చొరవ చూపాలని, ఎటువంటి తప్పులు లేకుండా జాబితా రూపొందేలా అధికారులు, ప్రజల మధ్య సమన్వయం చేయాలనీ తెలిపారు . మీటింగ్ అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి మంత్రి ఫరూక్ భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, పట్టణ అధ్యక్షులు మునియార్ ఖలీల్, జిల్లెల శ్రీరాములు, చాబోలు ఇలియాజ్ , మునగాల విశ్వనాథ్ రెడ్డి , కండే శ్యామ్ సుందర్ లాల్, మిద్దె ఉసేని, గోవిందు నాయుడు, శ్రీదేవి, నాగార్జున మరియు నంద్యాల నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# గొలుసుకట్టు చెరువుల అభివృద్ధితో భూగర్భ జలాల పెంపే లక్ష్యం.

..జలధార - జలహారతి పనుల్లో నంద్యాల జిల్లా రాష్ట్రానికి ఆదర్శం.

..కొలిమిగుండ్ల చెరువుల అనుసంధాన విజయగాథను ముఖ్యమంత్రికి వివరించిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 13:**
జలధారజలహారతి కార్యక్రమం కింద గొలుసుకట్టు చెరువుల అనుసంధానం, బేసిన్‌సబ్ బేసిన్ స్థాయిలో నీటి వనరుల సమర్థ నిర్వహణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా నంద్యాల జిల్లాలో వినూత్న చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. శనివారం అమరావతి నుంచి స్పెషల్ చీఫ్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పాల్గొన్నారు. సమావేశం మధ్యలో రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొనగా, జలధార–జలహారతి కార్యక్రమం కింద జిల్లాల్లో జరుగుతున్న పనుల పురోగతిని స్పెషల్ చీఫ్ సెక్రటరీ ముఖ్యమంత్రికి వివరించారు. నంద్యాల జిల్లాలోని కొలిమిగుండ్ల క్యాస్కేడ్ పరిధిలో ఎలాంటి అదనపు వ్యయం లేకుండా కేవలం ఎనిమిది రోజుల్లో 18 కిలోమీటర్ల మేర ఐదు గొలుసుకట్టు చెరువులను విజయవంతంగా అనుసంధానం చేసిన విధానాన్ని రాష్ట్రానికి ఆదర్శప్రాయమైన విజయగాథగా స్పెషల్ చీఫ్ సెక్రటరీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ వినూత్న కార్యక్రమం అమలు విధానం, సాధించిన ఫలితాలను స్వయంగా వివరించాలని జిల్లా కలెక్టర్ ను సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, జిల్లాలో బేసిన్, సబ్‌బేసిన్, మైక్రో బేసిన్ స్థాయిల్లో నీటి వనరుల సమగ్ర నిర్వహణకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని సీఎంకు నివేదించారు. సర్ప్లస్ బేసిన్ల నుంచి డెఫిసిట్ బేసిన్లకు నీటి సమతుల్యత సాధించే చర్యలతో పాటు గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణ, చెరువుల సుందరీకరణ, వర్షపు నీటి సంరక్షణ కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేస్తున్నట్లు సీఎం కు వివరించారు. భూగర్భ జలాల పెంపును ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ బావులను పీజోమీటర్లుగా వినియోగిస్తూ నీటిమట్టాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అలాగే డ్వామా సాంకేతిక సిబ్బందికి ప్రత్యేక శిక్షణ అందించి, భూగర్భ జలాల మట్టాలను శాస్త్రీయ పద్ధతుల్లో కొలిచే విధానాలను అమలు చేస్తున్నామని కలెక్టర్ వివరించారు. ఈ చర్యల ద్వారా నీటి వనరుల సుస్థిర వినియోగం, భూగర్భ జలాల సంరక్షణ, వ్యవసాయ రంగానికి దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరేలా కృషి చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. భూగర్భ జలాల పెంపు దిశగా జిల్లాలో చేపడుతున్న చర్యల ఫలితంగా మే నెలలో 7.54 మీటర్లుగా నమోదైన నీటి మట్టం, గత నవంబర్ నాటికి 3.51 మీటర్లకు చేరిందని కలెక్టర్ వెల్లడించారు. రానున్న నవంబర్ నాటికి దీనిని 2.51 మీటర్లకు తీసుకురావాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని, ప్రతి సీజన్‌కు కనీసం ఒక మీటరు మేర భూగర్భ జలమట్టాన్ని మెరుగుపరచాలనే సంకల్పంతో అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు. జలధార – జలహారతి కార్యక్రమం కింద నంద్యాల జిల్లాలో మొత్తం 2,103 పనులు మంజూరు కాగా, వాటిలో 894 పనులు పూర్తయ్యాయి, 1,209 పనులు గ్రౌండింగ్ దశలో ఉన్నాయని కలెక్టర్ వివరించారు. పనుల వేగవంతమైన అమలు ద్వారా నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, వ్యవసాయాభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తోందని కలెక్టర్ వెల్లడించారు. అంతకుముందు స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఇరిగేషన్ శాఖకు చెందిన సూపరింటెండింగ్ ఇంజనీర్లతో చెరువుల ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎం) పనుల పురోగతిని పరిశీలించారు. సమీక్ష సమావేశంలో ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు జోక్యం చేసుకొని, ఇప్పటికే పరిపాలనా అనుమతులు పొందిన పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు త్వరితగతిన ఫలితాలు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# నంద్యాలలో ఘనంగా కూటమి పాలన రెండేళ్ల విజయోత్సవ వేడుకలు.

..కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన... అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా విజయోత్సవ వేడుకలు.

..వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి ఫరూక్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 13:**నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాల పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా 'విజయోత్సవ సభ'ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్, నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ, అభివృద్ధి ఫలాలను వివరించారు. నంద్యాల నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. ఈ వేడుకల్లో భాగంగా మంత్రి ఫరూక్ కేక్ కట్ చేసి, పార్టీ శ్రేణులతో కలిసి విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు.

## నిరసనలో గాడిదలతో హంగామా..

# ఇదా మీ రాజకీయసంస్కారం..?

**..వైసిపి పై మంత్రి ఫరూక్ ఆగ్రహం. ..డీఎస్సీ పై న్యాయ విచారణకు సిద్ధం. ..వైసిపి ఆరోపణలను తిప్పికొట్టిన మంత్రి ఫరూక్.**
**..నంద్యాల అభివృద్ధి పై వైసిపి దుష్ప్రచారం మానుకోవాలి. మంత్రి ఎన్ఎండీ ఫరూక్.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 13:**
నంద్యాల పట్టణ అభివృద్ధి అంటేనే టీడీపీ.. టీడీపీ అంటేనే అభివృద్ధి అని రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు . నంద్యాల జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా వైసిపి నాయకులు డ్యాన్సులు చేస్తూ ప్రజల ముందు నవ్వులపాలవుతున్నారని విమర్శించారు.



**డీఎస్సీపై తప్పుడు ప్రచారం మానుకోండి:**
డీఎస్సీ పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవినీతి, అక్రమాలు జరగలేదని, ఇది పూర్తి పారదర్శకంగా జరిగిందని ఉన్నతాధికారులే చెబుతున్నారని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. దీనిపై న్యాయ విచారణకు కూడా తాము సిద్ధమని ప్రకటించారు. "డీఎస్సీలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న వైసిపి నేతలు, ఒకవేళ అక్రమాలు జరగలేదని నిరూపితమైతే రాజకీయ సన్యాసం తీసుకుంటారా?" అని ఆయన సవాల్ విసిరారు.

**వైసిపి నిరసనల పై ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి ఫరూక్**
వైసిపి నాయకులు చేపట్టిన నిరసన కార్యక్రమాలపై మంత్రి ఫరూక్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. "ఎద్దుల బండి, గాడిదల పై నిరసనలు తెలుపడం, నిరసన కార్యక్రమంలో డ్యాన్సులు, ఈలలు వేయడం వారి సంస్కారానికి నిదర్శనం అన్నారు. తప్పు చేసిన వారిని గాడిద పై ఊరేగిస్తారు, అటువంటిది వీరు గాడిదలపై నిరసన తెలపడం చూస్తుంటే వీరే తప్పు చేశారని అర్థమవుతోంది" అని ఎద్దేవా చేశారు. జగన్‌ను కుంభకర్ణుడితో పోల్చిన మంత్రి ఫరూక్ , పనిపాట లేకనే ఆయన డీఎస్సీపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అన్నారు.

**మార్కెట్ యార్డ్‌కు పెరిగిన ఆదాయం:**
నంద్యాల అభివృద్ధిలో భాగంగా నంద్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీలో చేపట్టిన 'ఓపెన్ ఆక్షన్' విధానంతో ఊహించని ఆదాయం వచ్చిందని మంత్రి వెల్లడించారు. కేవలం 10 దుకాణాల వేలం ద్వారానే రూ. 3.50 లక్షల ఆదాయం లభించిందని, ఈ నెల 20 న మరిన్ని దుకాణాలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనివల్ల ప్రభుత్వానికి మరింత ఆదాయం చేకూరుతుందన్నారు.

**రాజకీయాలు హుందాగా ఉండాలి:**
రాజకీయాల్లో అడుగుపెట్టినప్పటి నుంచి తాను టీడీపీని నమ్ముకున్నానని, పార్టీలు మారుతూ అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత వైసిపి నాయకులకు లేదని మంత్రి ఫరూక్ అన్నారు. నియోజకవర్గాల డి-లిమిటేషన్ జరిగితే వైసిపి నాయకులు ఏ పార్టీలో ఉంటారో వారికే తెలియని పరిస్థితి నెలకొందని, గత 15 ఏళ్లలో వారు చేసిన అభివృద్ధి శూన్యమని మండిపడ్డారు. ఇప్పటికైనా వైసిపి నాయకులు విమర్శలు మానుకుని, హుందాగా వ్యవహరించాలని మంత్రి ఫరూక్ సూచించారు.
ఈ కార్యక్రమంలో నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు , మాజీ టిడిపి రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల శ్రీరాములు , మాజీ కౌన్సిలర్ కండే శ్యామ్ సుందర్ లాల్ స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జూన్ 15వ తేదీన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం.

**..అన్ని మండల రెవెన్యూ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక.**
**..అర్జీల పరిష్కారం సమాచారం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేసి కనుక్కోవచ్చు.**
**..జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి.**




**ఆంధ్ర ప్రగతి కర్నూలు , జూన్ 13:** ఈ నెల 15వ తేదీ సోమవారం ఉదయం 9-30 గంటల నుండి కర్నూలు కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల రెవెన్యూ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు , మునిసిపల్ కార్యాలయాల్లో కూడ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.అర్జీల పరిష్కారం సమాచారం కోసం 1100 కు ఫోన్ చేయవచ్చుఅర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.. అలాగే అర్జీదారులు Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

## నంద్యాల లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం.

**-అధ్యక్షులు: సందీప్ కుమార్. -కార్యదర్శి: మేడా చంద్రశేఖర్. -కోశాధికారి: సురేష్.**


అధ్యక్షులు సందీప్ కుమార్.


కార్యదర్శి మేడా చంద్రశేఖర్


కోశాధికారి సురేష్.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 13:** నంద్యాల లయన్స్ క్లబ్ 2026 -27 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నంద్యాల లయన్స్ క్లబ్ ఎన్నికల కమిటీ సభ్యులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లయన్స్ క్లబ్ సమాఖ్య మాజీ చైర్మన్ ఏ.వి.ఆర్.ప్రసాద్, వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్ట్ డాక్టర్ రవి కృష్ణ,సీనియర్ సభ్యులు ఆంజనేయులు గుప్తా, డాక్టర్ సహదేవుడు, ఆడిటర్ గోపాలకృష్ణమూర్తి నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు.అధ్యక్షులుగా ముదియనూర్ సందీప్ కుమార్,కార్యదర్శిగా మేడా చంద్రశేఖర్,కోశాధికారిగా సురేష్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.ఉపాధ్యక్షులుగా పోసిన సుబ్బారావు,కూర ప్రసాద్,ఇమ్మడి వెంకట రామకృష్ణుడు ఎంపికయ్యారు. మిగతా కార్యవర్గాన్ని నూతన అధ్యక్ష కార్యదర్శులు ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ సందర్భంగా ఎన్నికల కమిటీ సభ్యులు మాట్లాడుతూ నంద్యాల లయన్స్ క్లబ్ 1970 సంవత్సరంలో ప్రారంభించబడిందని, గత 56 సంవత్సరాలుగా నంద్యాల లయన్స్ క్లబ్ ప్రజలకు అనేక రకాల సేవా కార్యక్రమాల్ని నిరంతరంగా కొనసాగిస్తూ వస్తున్నదని అన్నారు. నూతన అధ్యక్ష కార్యదర్శులుగా ఎంపికైన సందీప్, చంద్రశేఖర్, కోశాధికారి సురేష్ మాట్లాడుతూ రానున్న సంవత్సర కాలంలో లయన్స్ క్లబ్ తరఫున సామాజిక సేవా కార్యక్రమాలు,దివ్యాంగులకు, వృద్ధులకు సహాయ కార్యక్రమాలు,పర్యావరణ,విద్య ,సాంస్కృతిక ,క్రీడా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు.

## విద్యార్థుల ప్రాణాలతో

# చెలగాట మాడుతున్న అధికారులు..!

**-ఎచ్చులూడిన హాస్టల్ గోడల మధ్య భయం భయంతో బాలికల నివాసం.**
**-నంద్యాల బాలికల హాస్టల్ దుస్థితిపై ప్రశ్నిస్తున్న విద్యార్థులు,తల్లిదండ్రులు.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ జూన్ 13:**
నంద్యాల పట్టణం జూన్ 12 నుండి నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో పాఠశాలలు మరియు హాస్టళ్లకు విద్యార్థులు చేరుకుంటే వారికి సురక్షితమైన వసతి కల్పించాల్సిన బాధ్యత ఎవరిది..? నంద్యాల పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయం మరియు జిల్లా కోర్టుకు కూతవేటు దూరంలో ఉన్న బాలికల హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరినా అధికారులు స్పందించడం స్పందించకపోవడం బాధాకరం. విద్యార్థినుల ప్రాణాల కంటే ప్రభుత్వానికి మరేదైనా ముఖ్యమా అని పలువురు విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి..? నంద్యాల పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న బాలికల వసతి గృహం పరిస్థితులు చూస్తే ఇలాంటి ప్రశ్నలే ఉత్పన్నమవుతున్నాయి.
హాస్టల్ బాలికల హాస్టల్ భవనము గోడలు శిథిలావస్థకు చేరి పెచ్చులు ఊడిపడుతున్నాయి. దీనితో అందులో ఉంటున్న బాలికలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. అదేవిధంగా హాస్టల్ భవనం పై కప్పులు బలహీనంగా కనిపిస్తున్నాయి.గదుల్లో కనీస వసతులు లేక విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.అయినా సంబంధిత అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జూన్ నెలతో వర్షాకాలం ప్రారంభమవడంతో అధిక వర్షాలు కురిసినట్లయితే వర్షపు నీటికి తడిచిపోయిన పైకప్పు మరియు గోడలు ఏ క్షణమైనా పూలే ప్రమాదం కనబడుతుంది. అదేవిధంగా ఎప్పుడైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉన్నా ముందస్తు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.ఈ నెల 12 నుంచి విద్యాసంస్థలు పునఃప్రారంభమవడంతో విద్యార్థినులు హాస్టల్‌కు చేరుకున్నప్పటికీ భవనం మరమ్మతులపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడం ఆందోళన కలిగిస్తోంది.వర్షాకాలం ప్రారంభమైన వేళ శిథిల భవనంలో విద్యార్థినులను ఉంచడం ఎంతవరకు సమంజసమని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై నంద్యాల వైసీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. అధికారులు ఏదైనా ప్రమాదం జరగక ముందే త్వరగా చర్యలు తీసుకొని,శిథిలావస్థలో ఉన్న బాలికల వసతి భవనానికి మనమత్తులు చేయాలని కోరారు. విద్యార్థినుల భద్రతపై ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొంటుందా..? లేక ఏదైనా విషాదం జరిగిన తర్వాతే చర్యలు చేపడుతుందా అనేది వేచి చూడాలి. శిథిలావస్థకు చేరిన హాస్టల్ భవనానికి వెంటనే మరమ్మతులు చేపట్టి,విద్యార్థినులకు సురక్షిత వసతి కల్పించాలని ప్రజలు,తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థినుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్నా అధికారులు ఎందుకు మౌనం పాటిస్తున్నారు. హాస్టల్ భవనం బాగుచేసేందుకు నిధులు లేవా..? లేక విద్యార్థుల సమస్యలు ప్రభుత్వానికి కనిపించడం లేదా..?అంటూ విద్యార్థుల తల్లితండ్రులు విమర్శిస్తున్నారు. తక్షణమే జిల్లా సర్వోన్నత అధికారి డాక్టర్ జి .రాజకుమారి మరియు జిల్లా విద్యాశాఖ అధికారులు హాస్టల్ భవనం ను సందర్శించి మరమ్మతులు చేపట్టి, విద్యార్థులకు సురక్షితమైన ప్రదేశంగా హాస్టల్ భవనం ను తీర్చిదిద్ది విద్యార్థులకు భరోసా కల్పించాలని పలు విద్యార్థి సంఘాలతో పాటు తల్లిదండ్రులు కోరుతున్నారు.





## మా పొట్ట కొట్టొద్దు బాబూ..

### కాళ్లు పట్టుకుని రోదించిన వృద్ధ తల్లులు.!


**- నంద్యాల ప్రభుత్వాసుపత్రి వద్ద ఎనిమిదో రోజుకు చేరిన శానిటేషన్ కార్మికుల దీక్షలు.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ జూన్ 13:**
కరోనా కష్టకాలంలో ప్రాణాలను పణంగా పెట్టి, గత 20 ఏళ్లుగా నంద్యాల ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సేవలందించిన వృద్ధ తల్లులకు ఇవాళ కన్నీళ్లే మిగిలాయి. కేవలం 50 ఏళ్లు నిండాయనే సాకుతో, ముందస్తు సమాచారం లేకుండా 'పద్మావతి మెడికల్ ఏజెన్సీ' 13 మంది శానిటేషన్ కార్మికులను అన్యాయంగా విధుల్లోంచి తొలగించింది. తమను తిరిగి పనిలోకి తీసుకోవాలంటూ ఆ తల్లులు చేస్తున్న న్యాయపోరాటం శనివారానికి ఎనిమిదో రోజుకు చేరుకుంది.ఈ దీక్షా శిబిరం వద్ద శనివారం అత్యంత హృదయవిదారక దృశ్యం చోటుచేసుకుంది. పద్మావతి మెడికల్ ఏజెన్సీ అధినేత భాస్కర్ నాయుడు కుమారుడు కారులో అటుగా వెళ్తుండడం గమనించిన వృద్ధ మహిళా కార్మికులు పరుగు పరుగున ఆయన వద్దకు వెళ్లారు. వణుకుతున్న చేతులతో, కన్నీరు మున్నీరుగా విలపిస్తూ ఆయన కాళ్లు పట్టుకున్నారు. "మా వయసు చూసి కాదయ్యా... మా ఆకలి చూసి పని ఇవ్వండి... మా పిల్లల పొట్ట కొట్టొద్దు బాబూ" అంటూ రోదించారు. కానీ, కన్నతల్లి లాంటి వయసున్న ఆ శ్రమజీవుల కన్నీళ్లకు కరగని సదరు నిర్వాహకుని కుమారుడు, కనీసం వారిని పలకరించకుండానే హుటాహుటిన కారు ఎక్కి అక్కడి నుండి వెళ్ళిపోయాడు. ఏజెన్సీ నిర్వాహకుల రాతి గుండెతనాన్ని చూసి స్థానికులు సైతం ముక్కున వేలేసుకున్నారు.ఈ సందర్భంగా ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ & వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి డి. శ్రీనివాసులు మాట్లాడుతూ, రాయలసీమ జోన్-3 లో పద్మావతి మెడికల్ ఏజెన్సీ కార్మికుల పట్ల అత్యంత నిరంకుశంగా, అనాగరికంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఏజెన్సీ అక్రమాలపై 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' లో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. తొలగించిన 13 మంది కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, వారికి రావలసిన 6 నెలల బకాయి జీతాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రతతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు ఏఐటీయూసీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాధితులు సుశీలమ్మ, తులశమ్మ, రాజమ్మ, సులోచన, సునీత, వెంకటేశ్వరమ్మ, నాగేశ్వరమ్మ తదితర కార్మికులు పాల్గొన్నారు.

## ఖరీఫ్ సీజన్ వచ్చిన కేసి కెనాల్ తెలుగు గంగ

# కాలువలకు మరమ్మతులు చేపట్టారా..?







**ఆంధ్ర ప్రగతి మహానంది జూన్ 13:**
ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్న మరమ్మత్తులు చేపట్టారా ? కేసీ కెనాల్, తెలుగు గంగా కాలువలకు జులై 20 నుండి సాగునీరు వదులుతామని కొన్ని రోజుల క్రితం ప్రకటించారని రైతులు పేర్కొంటున్నారు. గత రబీ సీజన్ అనంతరం ప్రధాన కాలువలకు చేయాల్సిన మరమ్మత్తులు ఏమైనా ఉన్నాయా, అత్యవసరం ఎన్ని, తాత్కాలికంగా చేపట్టాల్సిన పనులు పెండింగ్లో ఎన్ని ఉన్నాయి అనే దానిపై సంబంధిత శాఖ వద్ద ఆధారాలు ఉన్నాయా లేవా అనే ప్రశ్నలు రైతు ల నుండి వినవస్తున్నాయి. కేసీ/ తెలుగు గంగ కెనాల్ ద్వారా ఖరీఫ్ సీజన్లో సాగునీరు అందించడానికి అని ఏర్పాట్లు చేశామని ఎలాంటి ఇబ్బందులు ఉండవని పైకి ప్రకటిస్తున్న ఇది ఎంతవరకు సాధ్యం అనేది ప్రశ్నార్థకంగా మారినట్లు తెలుస్తుంది. స్థానిక కిందిస్థాయి సిబ్బంది లస్కర్/ వర్క్ ఇన్స్పెక్టర్ తదితరులు ఉన్నతాధికారులకు బ్లాక్ స్పాట్లు/ పెండింగ్ పనులకు సంబంధించి సాగునీటి శాఖకు తెలియజేయాల్సి ఉంది. పూర్తి వివరాలు ఆ శాఖకు అందజేశారా, తెలియజేసిన నిధుల కొరత కారణంగా అధికారులు ఫైళ్లను పక్కన పడవేశారా అనేది తెలియాల్సి ఉంది. మరమ్మతులు చేపట్టకపోతే ఖరీఫ్ సీజన్లో వర్షాలు ఎక్కువైనప్పుడు, వరదల కారణంగా కాలువకు గండ్లు పడి కొంతమేర నష్టం జరిగే అవకాశం ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. మహానంది మండలం బొల్లవరం సమీపంలోని కేసీ కెనాల్ వద్ద కాంక్రీట్ వాల్ దెబ్బతిని శిధిలావస్థకు చేరుకుంది. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ఇలాంటివి ఇంకెన్ని ఉన్నాయో అధికారులు తేల్చాల్సి ఉంది. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏమిటి ఉపయోగం అని రైతులు విమర్శిస్తున్నారు.

## దివ్యాంగులు, వృద్ధులకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి భరోసా.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ జూన్ 13:**
నంద్యాల పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న అర్హులైన దివ్యాంగులకు, వయో వృద్ధులకు తానున్నానన్న భరోసా నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి ఇస్తున్నారు. భారత ప్రభుత్వం ఏ డి ఐ పి పథకం క్రింద ఎ ఎల్ ఎం సి ఓ ద్వారా దివ్యాంగులకు సహాయ పరికరాలు, వయో వృద్ధులకు సీనియర్ సిటిజన్ల సంక్షేమశాఖ ఎ పి డి ఏ ఎస్ సి ఏ సి పథకం ద్వారా సహాయక పరికరాలు ఈ నెల 15 వ తేదీన సోమవారం ఉదయం 11 గంటలకు నంద్యాల టెక్కె వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చేతుల మీదుగా పంపిణికి ఏర్పాట్లు చేశారు. సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ వారు నిర్ధారించిన షెడ్యూల్ ప్రకారం, భారత ప్రభుత్వ ఏడిఐపి పథకం కింద, ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చురింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో, అవసరమైన దివ్యాంగులకు వివిధ సహాయ పరికరాలు, ఉపకరణాలు ఉచితంగా అందించడానికి, గత ఏడాది 28-06-2025 నుండి 18-07-2025 వరకు నంద్యాల జిల్లాలోని 07 అసెంబ్లీ నియోజకవర్గాలలో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అసెస్‌మెంట్ క్యాంపులు నిర్వహించారు. ఆ ప్రత్యేక శిబిరాల్లో అర్హులైన దివ్యాంగులు, వయో వృద్ధులను గుర్తించి వారికి అవసరమైన పరికరాలు సుమారు రూ. 4 కోట్ల విలువగల, 3 వేల మందికి పైగా లబ్ధిదారులకు అవసరమైన పరికరాలు ఇప్పటికే నంద్యాల గోదాములకు చేరుకున్నాయి. వాటిని ఈ నెల 15 వ తేదీ నంద్యాల టెక్కె వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంబంధించిన యంత్రాంగం ఏర్పాట్లు చేసి నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆధ్వర్యంలో పంపిణీ చేయనున్నారు.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002
AND PUBLUSHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
ఆదివారం 14 జూన్ 2026

# అత్యాశే మనిషికి నిజమైన శత్రువు..!

**..త్వరగా ధనవంతులు కావాలి.**

**.తక్కువ సమయంలోనే ఎక్కువ డబ్బు సంపాదించాలనే అత్యాశే మోసగాళ్లకు బ్రహ్మాస్త్రం.**

**..ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో పెరుగుతున్న ఆర్థిక మోసాలు.**

**..వివేకం కోల్పోతే జీవితాంతం కష్టపడి కూడబెట్టిన సంపద క్షణాల్లో మాయమవుతుంది.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూన్ 13:** ఒకప్పుడు దొంగలు అర్ధరాత్రి ఇళ్లలోకి చొరబడి సంపదను దోచుకెళ్లేవారు. నేడు మోసగాళ్లకు ఆ అవసరం లేదు. ఒక మొబైల్ ఫోన్, ఒక ఆకర్షణీయమైన ప్రకటన, కొన్ని మాయమాటలు చాలు. మనమే వారి వలలో పడుతూ, మన కష్టార్జిత సంపదను వారి చేతుల్లో పెడుతున్నాం. ఇదే నేటి ఆర్థిక మోసాల చేదు వాస్తవం. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా పెట్టుబడి మోసాలు, మైక్రో ఫైనాన్స్ కుంభకోణాలు, ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసాలు, క్రిప్టో ఉచ్చులు, గోల్డ్ స్కీములు, మల్టీ లెవెల్ మార్కెటింగ్ పేరుతో జరుగుతున్న ఆర్థిక నేరాలు వేలాది కుటుంబాల జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి.

ఇటీవల వెలుగుచూసిన అనేక పెట్టుబడి స్కాంలు, మైక్రో ఫైనాన్స్ మోసాలు, నకిలీ పెట్టుబడి పథకాలు ప్రజల జీవితకాల పొదుపులను కబళించాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న ఈ మోసాలు ఆందోళన కలిగిస్తున్నాయి. డబ్బు పోవడం మాత్రమే కాదు... దానితో పాటు మానసిక ప్రశాంతత, కుటుంబ ఆనందం, భవిష్యత్తుపై నమ్మకం కూడా కోల్పోతున్నారు. జీవితాంతం శ్రమించి కూడబెట్టిన సంపద కొన్ని రోజుల్లోనే ఆవిరైపోతోంది.

ఈ పరిస్థితుల్లో ఒక ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. సమాజంలో మోసగాళ్లు పెరుగుతున్నారా? లేక మోసపోయే వారి సంఖ్య పెరుగుతోందా? నిజానికి మోసగాళ్లు కొత్తవారు కాదు. యుగాలుగా ఉన్నవారే. మారింది వారి రూపం, పద్ధతి, సాంకేతికత మాత్రమే. కానీ వారి వలలో చిక్కుకునే వారి సంఖ్య పెరగడానికి ప్రధాన కారణం ఒక్కటే: అత్యాశ.

### ఆశ అవసరం... అత్యాశ ప్రమాదం

ఆశ మనిషిని ముందుకు నడిపిస్తుంది. ఆశయం జీవితానికి దారి చూపుతుంది. కానీ శ్రమ లేకుండా, సమయం పట్టకుండా, తక్కువ కాలంలో అధిక లాభాలు పొందాలని కోరుకోవడం అత్యాశ. అదే మోసాలకు మొదటి మెట్టు.

"అధిక వడ్డీ", "రెట్టింపు లాభాలు గ్యారెంటీ", "రిస్క్ లేని పెట్టుబడి", "ఇతరులు లక్షలు సంపాదిస్తున్నారు", "మీ బంధువులు కూడా పెట్టారు" వంటి మాటలు వినగానే చాలా మంది ఆలోచనను పక్కనపెట్టి భావోద్వేగాలతో నిర్ణయాలు తీసుకుంటారు. నిజానికి మోసగాళ్లు ముందుగా మన డబ్బును కాదు... మన ఆలోచనా విధానాన్ని దోచుకుంటారు. వివేకం కంటే అత్యాశ బలంగా మారిన క్షణమే మోసం విజయవంతమవుతుంది.

### చదువుకున్నవారూ ఎందుకు మోసపోతున్నారు?

ఈ మోసాలకు బలవుతున్నవారిలో కేవలం అమాయకులు మాత్రమే లేరు. ఉన్నత విద్యావంతులు, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, పదవీ విరమణ చేసినవారు, సాఫ్ట్‌వేర్ నిపుణులు కూడా ఉన్నారు. ఎందుకంటే మోసగాళ్లు మన తెలివితేటలను కాదు, మన బలహీనతలను లక్ష్యంగా చేసుకుంటారు. ఎక్కువ సంపాదించాలని కోరుకోని వ్యక్తి ఉండడు. ఆ కోరికనే వారు ఆయుధంగా మార్చుకుంటారు.

### సోషల్ మీడియా - మోసాలకు కొత్త వేదిక

ఒకప్పుడు మోసగాళ్లు ఇంటింటికీ తిరిగి నమ్మకం సంపాదించాల్సి వచ్చేది. ఇప్పుడు సోషల్ మీడియా ఆ పనిని సులభతరం చేసింది. నకిలీ వెబ్‌సైట్లు, కృత్రిమ విజయగాథలు, ప్రముఖుల ఫోటోలు, ఫేక్ రివ్యూలు, వాట్సాప్ గ్రూపులు, టెలిగ్రామ్ ఛానెల్లు, యూట్యూబ్ ప్రకటనలు... ఇవన్నీ నమ్మకాన్ని అమ్మే సాధనాలుగా మారిపోయాయి. మొబైల్ స్క్రీన్‌పై కనిపించే ప్రతి అవకాశం నిజం కాదు. చాలా సందర్భాల్లో అది మోసానికి వేసిన అందమైన ముసుగు మాత్రమే.

### ఆర్థిక అక్షరాస్యత అవసరం

నేటి ప్రపంచంలో చదవడం, ఉద్యోగం చేయడం మాత్రమే సరిపోదు. డబ్బును ఎలా సంపాదించాలో తెలిసినంతగా, దాన్ని ఎలా కాపాడుకోవాలో కూడా తెలుసుకోవాలి.

పెట్టుబడి పెట్టే ముందు ప్రతి ఒక్కరూ ఒక సూత్రాన్ని గుర్తుంచుకోవాలి: అధిక లాభం అంటే అధిక ప్రమాదం. ప్రమాదం లేకుండా భారీ లాభాలు వస్తాయని చెప్పేవాడు వ్యాపారి కాదు, మోసగాడే అయ్యే అవకాశాలు ఎక్కువ. ఏ పథకంలోనైనా పెట్టుబడి పెట్టే ముందు దాని చట్టబద్ధత, వ్యాపార నమూనా, లాభాల మూలం, నియంత్రణ సంస్థల అనుమతులు ఉన్నాయా లేదా అన్న విషయాలను పరిశీలించాలి. అర్థం కాని చోట డబ్బు పెట్టడం అంటే కళ్లుమూసుకుని అగాధంలో అడుగు వేయడమే.

### గుర్తుంచుకోవాల్సిన ముఖ్యమైన విషయాలు

శ్రమ లేకుండా వచ్చిన సంపద ఎక్కువకాలం నిలవదు. అసాధారణ లాభాలు వస్తాయని చెప్పే ప్రతి అవకాశానికి వెనుక అసాధారణ ప్రమాదాలు కూడా దాగి ఉంటాయి.

కేవలం "అందరూ పెట్టుబడి పెడుతున్నారు" కాబట్టి మనం కూడా పెట్టడం సరైన నిర్ణయం కాదు.

"నాకు తెలిసిన వ్యక్తి చెప్పాడు" అనే కారణం ఏ పెట్టుబడికైనా భద్రతకు హామీ ఇవ్వదు.

పెట్టుబడులు పెట్టే ముందు పూర్తిస్థాయిలో సమాచారం సేకరించడం, ప్రమాదాలను అంచనా వేయడం, వివేకంతో నిర్ణయం తీసుకోవడం అత్యంత అవసరం.

మన డబ్బుకు మనమే కాపలాదారు

ప్రభుత్వాలు చట్టాలు చేయగలవు. పోలీసులు నేరస్తులను పట్టుకోగలరు. కోర్టులు శిక్షలు విధించగలవు. కానీ మోసపోయిన తర్వాత కోల్పోయిన డబ్బు, నమ్మకం, ప్రశాంతతను పూర్తిగా తిరిగి తీసుకురావడం చాలా కష్టం.

అందుకే ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తి, ప్రతి పెట్టుబడిదారు గుర్తుంచుకోవాల్సిన సత్యం ఒక్కటే:

"అత్యాశ మొదలైన చోట వివేకం ఉండదు... వివేకం లేని చోటే మోసం ప్రారంభమవుతుంది."


త్వరగా ధనవంతులు కావాలనే ఆరాటం కంటే, కష్టపడి ఎదగాలనే సహనం గొప్పది. ఎందుకంటే డబ్బు కోల్పోతే తిరిగి సంపాదించవచ్చు. కానీ జీవితకాల శ్రమతో కూడిన పొదుపులు కోల్పోతే ఆ గాయం చాలా కాలం మానదు.

అందుకే... అత్యాశను అదుపులో ఉంచండి. అవగాహనను పెంచుకోండి. వివేకంతో నిర్ణయాలు తీసుకోండి. మీ కష్టార్జిత సంపదను కాపాడుకోండి. అత్యాశ మనిషిని ధనవంతుడిని చేయడం ఏమో కానీ క్షణాల్లో నిరుపేదను మాత్రం చేయగలదు

# జైల్లో నిందితుడు..

# ఫైల్లో టైఫాయిడ్..!

## నంద్యాల డిఆర్డిఏ వెలుగులో చీకటి బాగోతం.




వైద్యుడు భక్తవచ్చల రెడ్డి



వెలుగు ఏ.పి.ఎం.శ్రీనివాసులు.




వైద్యుడు ఇచ్చిన మెడికల్ సర్టిఫికెట్.



వెలుగు పిడి శ్రీధర్ రెడ్డి.

**-మైనర్ బాలికపై వేధింపులు.**

**-పోక్సో కేసులో అరెస్టై రిమాండ్‌కు వెళ్లొచ్చిన ఏపీఎం శ్రీనివాస్.**

**-జైల్లో ఉన్న వ్యక్తికి టైఫాయిడ్ అంటూ మెడికల్ సర్టిఫికెట్.. వ్యవస్థను బురిడీ కొట్టించిన వైనం.**

**-రిమాండ్‌లో ఉన్న నిందితుడికి మెడికల్ సర్టిఫికెట్ ఇచ్చిన డాక్టర్.**

**-ప్రభుత్వ ఉద్యోగి అరెస్టైనా సంబంధిత శాఖకు చేరని ఎఫ్ఐఆర్ కాపీ.**

**-పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు.**

**-పోలీసుల నుంచి ఎఫ్ఐఆర్ కాపీ అందకపోవడంతోనే మెడికల్ లీవ్ మంజూరు చేశామన్న వెలుగు పీడీ శ్రీధర్.**

**-పోక్సో నిందితుడిని సస్పెన్షన్ నుంచి కాపాడేందుకు తెరవెనుక ఎవరెవరు సహకరిస్తున్నారు.**

**-నకిలీ సర్టిఫికెట్ సృష్టించిన నిందితుడిపై, జారీ చేసిన డాక్టర్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్.**

**-పోలీసుల నిర్లక్ష్యం, వెలుగు ఆఫీసులో లీవ్ వ్యవహారంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరపాలి.**

**-న్యాయం కోసం జిల్లా ఎస్పీ నీ కలవనున్న బాధితురాలి తల్లిదండ్రులు.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ జూన్ 13:** నంద్యాల పట్టణం శివారులోని వైఎస్సార్ నగర్ లో ఇటీవల జరిగిన ఉదంతం.

కటకటాల వెనక ఉన్న ఓ కీచకుడు.. దర్జాగా మెడికల్ లీవ్ తో అధికారులను బురిడీ! మైనర్ బాలికపై అసభ్యంగా ప్రవర్తించి పోక్సో చట్టం కింద అరెస్ట్ అయిన ఓ ప్రభుత్వ ఉద్యోగి వ్యవహారం ఇప్పుడు నంద్యాలలో తీవ్ర దుమారం రేపుతోంది. ఒక తప్పును కప్పిపుచ్చుకునేందుకు.. ఏకంగా వ్యవస్థనే బురిడీ కొట్టించిన ఈ 'వెలుగు' ఉద్యోగి నిర్వాకం. ఆయనో ప్రభుత్వ ఉద్యోగి.. పేరు శ్రీనివాస్.. నంద్యాల డీఆర్డీఏ 'వెలుగు' ఆఫీసులో ఏపీఎం. చేయరాని తప్పు చేసి, గత నెల వైఎస్ నగర్ కు చెందిన మైనర్ బాలికను వేధించిన కేసులో అరెస్టై రిమాండ్‌కు వెళ్లాడు. కానీ, ఇక్కడే అసలు కథ మొదలైంది. జైల్లో ఊచలు లెక్కపెడుతున్న ఈ పెద్దమనిషి.. ఆఫీసు రికార్డుల్లో మాత్రం టైఫాయిడ్ జ్వరంతో బాధపడుతున్నాడు! తాను విధులకు రాలేనని భార్య ద్వారా మెడికల్ లీవ్ పెట్టించడమే కాకుండా, డాక్టర్ సర్టిఫికెట్ కూడా సమర్పించడం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. జైల్లో ఉన్నోడికి బయట ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నట్లు సర్టిఫికెట్ ఎలా పుట్టుకొచ్చింది.

పోక్సో నిందితుడికి వ్యవస్థలో అండగా నిలిచిందెవరు రిమాండ్‌లో ఉన్న వ్యక్తికి టైఫాయిడ్ అంటూ నకిలీ మెడికల్ సర్టిఫికెట్ ఇచ్చిన ఆ డాక్టర్ ఎవరు కాసులకు కక్కుర్తి పడి ఓ కీచకుడికి వత్తాసు పలికారా తప్పు చేసిన నిందితుడు ఎంత క్రిమినలో.. చట్టాన్ని పక్కదారి పట్టించేలా మెడికల్ సర్టిఫికెట్ ఇచ్చిన డాక్టర్ కూడా అంతే శిక్షార్హుడు. ఈ వ్యవహారం

లో ఆ డాక్టర్ పాత్రపై కూడా ఇప్పుడు సవాక్షాలు సంధించాల్సిన అవసరం ఉంది. ఇక ఈ వ్యవహారంలో పోలీసుల తీరు అత్యంత వివాదాస్పదంగా మారింది. ఓ ప్రభుత్వ ఉద్యోగి పోక్సో కేసులో అరెస్టైతే.. ఆ ఎఫ్ఐఆర్ కాపీని సంబంధిత శాఖకు ఎందుకు పంపలేదు వెలుగు పీడీ శ్రీధర్ స్వయంగా "మాకు పోలీసుల నుంచి ఎటువంటి ఎఫ్ఐఆర్ కాపీ అందలేదు.. అంది ఉంటే అదే రోజు కఠిన చర్యలు తీసుకునేవాళ్లం" అని స్పష్టం చేస్తున్నారు. అంటే, నెల రోజులుగా ఎఫ్ఐఆర్ కాపీని ఎందుకు తొక్కిపెట్టారు ఇది కేవలం పరిపాలనా వైఫల్యమా లేక నిందితుడిని సస్పెన్షన్ వేటు నుంచి కాపాడేందుకు జరిగిన తెరవెనుక ఒప్పందమా

అధికారం, డబ్బు ఉంటే చట్టంలోని లొసుగులను ఎలా వాడుకోవచ్చో నంద్యాల ఏపీఎం శ్రీనివాస్ ఉదంతం కళ్లకు కడుతోంది. ఒక పోక్సో కేసు నిందితుడికి వ్యవస్థలో ఇంతమంది వత్తాసు పలకడం పట్ల సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. నకిలీ సర్టిఫికెట్ సృష్టించిన శ్రీనివాస్ పై, దాన్ని జారీ చేసిన డాక్టర్‌పై, అలాగే ఎఫ్ఐఆర్ కాపీని గోప్యంగా ఉంచిన వారిపై సమగ్ర విచారణ జరపాలి. అసలు వాస్తవాలను వెలికితీసి కఠిన చర్యలు తీసుకున్నప్పుడే వ్యవస్థపై సామాన్యుడికి నమ్మకం ఉంటుంది. ఆ ఉద్యోగి ఇప్పటికీ ఆదేశాఖలో ఉద్యోగం చేస్తుండడంతో విషయం తెలుసుకున్న బాధితురాలి తల్లిదండ్రులు న్యాయం కోసం జిల్లా ఎస్పీ నీ కలవనున్నారు .నంద్యాలలో కొందరు వైద్యులు ఆసుపత్రిలో వైద్యం చేయించుకోకపోయినా కాసులకు కక్కుర్తి పడుతూ ఇలా మెడికల్ సర్టిఫికెట్లు ఇస్తున్నవారిపై కూడా ప్రభుత్వం దృష్టిపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రోగులను పరీక్షలు చేయకుండా ఫారిన్ తరహాలో ఫోన్లలో వైద్యం చేస్తూ, క్యాజువలిటీ సిబ్బందే టెస్టులు రాస్తున్న వైద్యాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

